క్లుప్తంగా

ఎమ్మెల్సీ దృష్టికి స్థానిక సమస్యలు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, బస్తీలకు చెందిన ప్రజలు మంగళవారం ఆయనను కలిశారు. పలు సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు సమర్పించారు. వెంటనే స్పందించిన శంభీపూర్ రాజు ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ధ్యేయని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్‌లో మంగళవారం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ పాదయాత్ర నిర్వహించారు. సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి వీలైనంత తొందరగ పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు హనుమంతు, కురుమా రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన దృశ్యం

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుంది. దుండిగల్ మున్సిపల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆక్రమణలపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇటీవల తరుచూ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మల్లంపేట సాయిబాలాజీలో హెచ్‌ఎండీఏ అనుమతికి మించి అదనపు అంతస్తు నిర్మిస్తున్నారన్న ఫిర్యాదు అందింది. వెంటనే సిబ్బందిని పంపించి నిర్మాణాన్ని కూల్చివేయించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

పార్కు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి


శ్రీనివాస్‌నగర్ పార్కును సందర్శిస్తున్న డిప్యూటీ మేయర్

నిజాంపేట్: మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా కార్పొరేషన్ పని చేస్తోందని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. 7వ డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ పార్కును ఆయన మంగళవారం అధికారులతో కలిసి సందర్శించారు. పార్కులో జరుగుతున్న ట్రాక్ లెవెలింగ్, డెవలప్‌మెంట్, ప్రహరీ, రొటేటరీ గేట్, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ, ఇంజినీర్ అరుణ్, బీఆర్‌ఎస్ నాయకులు హరి, దశరథ్, సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై మంగళవారం జలమండలి మేనేజర్ పూజిత స్థానికంగా పర్యటించారు. గాంధీనగర్ రోడ్డు నం.12/1లో మురుగు చేరుతోందన్నారు. రోడ్డు నం.14, 15లలో తాగునీరులో ప్రెషర్‌తో వస్తోందని యువజన సంఘం నాయకుడు లక్ష్మీనాథ్ ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా రోడ్డు నం.12/2, 12/3, మజీద్ గల్లీ, హనుమాన్ టెంపుల్ గల్లీలలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరుగా మేనేజర్ పూజిత సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కాలనీవాసులు చింతయ్య, భీమయ్య, నర్సిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.


గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్యను జలమండలి మేనేజర్‌కు వివరిస్తున్న స్థానికులు

శభాష్..

ఇంటర్‌లో సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు


భోగ రాగవి (411/470)


డి.లక్ష్మి (961)

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ భాగంలో డి.లక్ష్మి (961/1000), నీలకంఠరావు శివతేజ (955/1000), బి.స్వాతి లక్ష్మి (948/1000), బైపీసీ గ్రూపులో తబస్సుమ్ బేగం (963/1000), సనా ఫిర్దౌస్ (890/1000), సీఈసీ గ్రూప్‌లో శ్రీనివాస్‌గౌడ్ (887/1000), హెచ్ఈసీ గ్రూప్‌లో భానుతేజ (848/1000) అత్యుత్తమ మార్కులు సాధించారు. అదే విధంగా ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ భోగ రాగవి (411/470), హాబిబ్ భవానీ (356/470), బైపీసీ గ్రూపులో డి.మానస (308/440), సీఈసీలో ఎండీ ఆస్మా (356/500), హెచ్ఈసీ గ్రూపులో వి.విష్ణువర్ధన్ (298/500) మార్కులతో కళాశాలకు పేరు తీసుకొచ్చారు. అత్యుత్తమమైన మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు అభినందించారు.

– సుభాష్‌నగర్:



శివతేజ (955) స్వాతి లక్ష్మి (948)



సనా ఫిర్దౌస్ (890) శ్రీనివాస్‌గౌడ్, 887



శ్రీనివాస్‌గౌడ్, 887 హాబిబ్ భవానీ,356



డి.మానస (308) ఎండీ ఆస్మా, 356

అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా మంగళవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీరాఘవేంద్రకాలనీ, వెంకటేశ్వరకాలనీ వెస్ట్, ఈస్ట్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. శ్రీరాఘవేంద్రనగర్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఉమాపతి, వెంకటేశ్వర కాలనీ వెస్ట్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, జనరల్ సెక్రటరీ చెక్రీ, వెంకటేశ్వర ఈస్ట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ మహేష్, బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న శ్రీరాఘవేంద్ర కాలనీవాసులు

◆ గోదావరి హోమ్స్‌లో రూ.69 కోట్లతో చేపడుతున్న ఎస్ఎస్‌డీపీ నాలా నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సెంట్రల్ లైటింగ్ పనులు వేగవంతం

కుత్బుల్లాపూర్: సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు వేగవంతం చేశారు. సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్ – అయోధ్యనగర్ మీదుగా సుమారు రెండున్నర కిలోమీటర్లు సీఆర్‌ఎంపీ నిధులతో చేపట్టిన డివైడర్ల మధ్య సెంట్రల్ లైటింగ్ కోసం ఇటీవల దిమ్మెలు కట్టారు. దీంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి సుమారు రూ.25లక్షలతో 80 పోల్స్ లైట్లు అమర్చే పనులను పూర్తి చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆదేశాలతో జోనల్ విద్యుత్ డీజీ రఘుపతిరెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జీన్స్ ఫ్యాక్టరీ వద్దకు పోల్స్ బిగించే పనులు పూర్తి చేశారు. మరో రెండు మూడు రోజుల్లో అయోధ్యనగర్ వరకు పోల్స్ బిగించి అనంతరం లైట్లు ఏర్పాటు చేసేందుకు వైర్లను గుంజుతున్నారు.. సుమారు 25 మీటర్లకు ఒక పోల్స్ చొప్పున ఏర్పాటు చేస్తూ మొత్తం రెండు కిలోమీటర్ల మేర ఈ విద్యుత్ అనుసంధానం చేశారు.



కూతురిపై సవతి తండ్రి లైంగికదాడికి యత్నం

- ఆత్మరక్షణ కోసం కర్రతో తలపై మోదిన బాలిక
- ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి

కుత్బుల్లాపూర్: లైంగికదాడికి యత్నించిన సవతి తండ్రిపై కుమార్తె తనను రక్షించుకునే క్రమంలో కర్రతో దాడి చేయగా తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన జయశ్రీనాయక్ అనే మహిళకు 30 ఏళ్ల క్రితం వివాహం కాగా నలుగురు సంతానం ఉన్నారు. అయితే ఎనిమిదేళ్ల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు విడిపోయారు. అప్పటి నుండి నలుగురు పిల్లలు తండ్రి వద్దనే ఉంటూ వస్తుండగా, జయశ్రీనాయక్ మాత్రం పద్మనాభనాయక్ అనే వ్యక్తితో సహజీవనం కొనసాగిస్తోంది. వీరిద్దరు గత ఏడాది కిందట నగరానికి వలస వచ్చి కండ్లకోయ జీవికె ఈఎంఆర్ఐలో పని చేసుకుంటూ అక్కడే ఓ రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు.


మృతుడు పద్మనాభ

గత మూడు నెలల క్రితం జయశ్రీనాయక్ కూతురు(17) తల్లి వద్దకు వచ్చింది. ఈ క్రమంలో సవతి తండ్రి చేష్టలు నచ్చేవి కావు, దీంతో పలుమార్లు అతన్ని హెచ్చరించినా తీరు మార్చుకోలేదు. ఈ నెల 8న మధ్యాహ్నం సమయంలో జయశ్రీనాయక్ డ్యూటీకి వెళ్లగా ఇంట్లో కుమార్తె ఒంటరిగా ఉంది. దీంతో మద్యం సేవించి వచ్చిన పద్మనాభనాయక్ ఆమెపై లైంగికదాడికి యత్నించాడు. ఈ క్రమంలో తనకు తాను రక్షించుకునే క్రమంలో కడి (కర్ర)తో అతని తలపై దాడి చేసింది. దీంతో అతను అపస్మారక స్థితికి చేరుకోవడంతో మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన జయశ్రీనాయక్‌కు జరిగిన విషయం చెప్పింది. దీంతో పద్మనాభనాయక్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 7.30 గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన భాగ్యరథి విద్యార్థులు


అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో భాగ్యరథి జూనియర్ కళాశాల యాజమాన్యం

కుత్బుల్లాపూర్: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఎంపీసీ గ్రూప్‌లో భావన (987/1000), బైపీపీలో మాధురి (974/1000), సీఎస్ఇలో ఐశ్వర్య(971/1000) మార్కులు సాధించారు. అదే విధంగా జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో నందిని (459/470), బైపీసీలో రషీద్ (432/440), ఎంఈసీలో సౌమ్య (463/500), సీఈసీ లో సాయి చందన (484/500) మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తదుపరి సంవత్సరంలో ఎలాంటి ట్యూషన్ ఫీజు లేకుండా ఉచితంగా విద్యనందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రమేష్‌బాబు, రాధాకృష్ణ, నల్ల జైశంకర్‌గౌడ్, సీహెచ్ గోవిందరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

14 నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌సీఎల్ నార్త్ ఎవెన్యూ సాయిబాబా ఆలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. 14న కాగడ హారతి, గణపతి పూజ, గణపతి హోమం, సుబ్రహ్మణ్య హోమం, 15వ తేదీన చండీహోమం, దత్త హోమం, అన్నసంతర్పణ, 16వ తేదీన రుద్ర హోమం కలశాభిషేకం, పుష్పాభిషేకం, అన్నసంతర్పణ సాయంత్రం పల్లకి సేవ ఉంటుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మిస్టరీగానే వెంకటేశ్‌గౌడ్ హత్య

దుండిగల్: ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితులను గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. దుండిగల్ గ్రామానికి చెందిన ఈదుల కంటి వెంకటేశ్‌గౌడ్(46) ఫైనాన్స్ వ్యాపారంతో పాటు సెంట్రింగ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఈనెల 7వ తేదీన డి.పోచంపల్లి కుడికుంట చెరువు సమీపంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే అదే రోజు అతనికి ఫోన్ చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతని పాత్ర లేదని తెలిసింది. వెంకటేశ్‌గౌడ్‌ను కలిసిన వ్యక్తి అదే రోజు తిరిగి తన ఇంటికి వెళ్లిపోయినట్లు పోలీసులు సాంకేతికంగా గుర్తించారు. సమీప ప్రాంతానికి చెందిన దాదాపు 20 మందిని సైతం విచారించినట్లు సమాచారం. అందరితో కలివిడిగా, సౌమ్యంగా ఉండే వెంకటేశ్‌ను ఎవరు హత్య చేశారన్నది మిస్టరీగా మారింది. కుటుంబ సభ్యులు సైతం ఎవరిపై అనుమానాలు వ్యక్తం చేయలేదు. 7వ తేదీన ఆయన దుండిగల్ గ్రామంలోని ఇంటి నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వచ్చిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు కష్టసాధ్యమవుతోంది. త్వరలోనే కేసును చేధిస్తామని పోలీసులు తెలిపారు.

సామాజిక సేవతో ఆత్మ సంతృప్తి


విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న అనుశ్రేయారెడ్డి

దుండిగల్: సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఎంఎల్ఆర్ఐటి కళాశాల డైరెక్టర్ మర్రి అనుశ్రేయారెడ్డి అన్నారు. కళాశాల ట్రెజరర్, తన తల్లి మమతారెడ్డి జన్మదినం సందర్భంగా గౌడవెల్లిలోని కృషి హోమ్స్‌లో 100 మంది అనాథ పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తమ కళాశాల ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పలు గ్రామాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఉదయ్‌రంజన్‌గౌడ్, వలంటీర్లు పూజ, పృథ్వీ, ప్రతాప్, హరీశ్, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగతనానికి యత్నం


నిందితుడు

జగద్గిరిగుట్ట: పట్టపగలే ఓ దొంగ ఇల్లును గుల్ల చేయడానికి యత్నించాడు. పట్టుకుందామనే లోపే చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం స్టేషన్ పరిధిలోని షిరిడీహిల్స్ రోడ్ నం.24లో ఉంటున్న నవీన్ కుటుంబం మంగళవారం మధ్యాహ్నం ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. చుట్టు పక్కల ఇళ్లల్లో కూడా పెద్దగా మనుషులు లేకపోవడంతో ఓ దొంగ తాళం పగలగొట్టడానికి ఉపయోగించే పనిముట్లలో వచ్చి ఇంట్లో దొంగతనం చేయడానికి ప్రయత్నించాడు. తాళం పగలగొట్టే సమయంలో చుట్టు పక్కల ఉన్న వాళ్లకి శబ్దం రావడంతో వచ్చి పట్టుకోవడానికి ప్రయత్నించారు. కాని అందరిని బెదిరిస్తూ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయమై స్థానికులు పోలీసులకి ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

జీఓ.59ను అడ్డుగా పెట్టుకుని ప్రభుత్వ స్థలాల కబ్జా

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్


కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డు స్థలం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడమే పనిగా పెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి సర్వే నం.186లోని హౌసింగ్‌బోర్డు స్థలాన్ని మంగళవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సంర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. జీఓ.59ను అడ్డుగా పెట్టుకుని సర్వే నం.186లో రాత్రికి రాత్రి ప్రభుత్వ భూమిలో మట్టి పోసి చదును చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ స్థలాలకు సంబంధించి నకిలీ ట్యాక్స్‌లు, కరెంట్ బిల్లులు సృష్టిస్తున్నారని తెలిపారు.

◆ బీఆర్ఎస్ నాయకులకు కింది స్థాయి సిబ్బంది సహకరిచడం సిగ్గుచేటన్నారు. దీనిపై హౌసింగ్ బోర్డు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరు ఎకరాల పైచీలుకు ఉన్న హౌసింగ్ బోర్డు స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి పరిరక్షించాలన్నారు. లేకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు సతీష్, మైనార్టీ మోర్చ మహిళా ప్రముఖ అమలేశ్వరి, ఎస్సీ మోర్చా స్టేట్ స్కాలర్‌షిప్ సెల్ జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్ష రామచంద్ర నాయక్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కాశి తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ గుంత మూసేసి.. సమస్యను పరిష్కరించి



ఎస్ఎస్ఆర్ గార్డెన్ వద్ద అధికారులు మూసేసిన డ్రైనేజీ గుంత

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ఆర్ గార్డెన్ వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతున్న విషయంపై సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. 'డ్రైనేజీ పొంగుతున్న పట్టించుకోరా?'అనే కథనం ఆదివారం ప్రచురితమైంది. కమిషనర్ శ్రీహరి సిబ్బందితో డ్రైనేజీ గుంతను మూసేసి నీరు బయటకు రాకుండా చర్యలు చేపట్టారు. ఈ విషయంపై గతంలో పలు పర్యాయాలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని.. సాక్షిలో వచ్చిన కథనం ద్వారా స్పందన వచ్చిందని బీజేపీ నాయకుడు సతీష్, మల్లికార్జునరావులు హర్షం వ్యక్తం చేశారు.

కుత్బుల్లాపూర్ యూనిట్ యూపీహెచ్‌సీ అధ్యక్షురాలిగా నజీమా


కుత్బుల్లాపూర్ యూనిట్ టీఎన్జీవో సభ్యులతో జిల్లా చైర్మన్ రవిప్రకాష్

కుత్బుల్లాపూర్: టీఎన్జీవో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ యూనిట్ యూపీహెచ్‌సీ ఎన్నికలు మంగళవారం ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ రవిప్రకాష్ అధ్యక్షతన జరిగాయి. అధ్యక్షురాలిగా నజీమా (ఆరోగ్యశాఖ), ప్రధాన కార్యదర్శిగా జ్యోతి (ఐసీడీఎస్), కోశాధికారిగా సత్యజ్యోతి (ఆరోగ్యశాఖ), కార్యవర్గ సభ్యులుగా రఘు (బీసీ వెల్ఫేర్), కిషన్ (పశుపోషణ), నర్సింహాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ.. ఇటీవల రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఈశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు జేమ్స్ దాస్, మల్కాజ్‌గిరి యూనిట్ ప్రధానకార్యదర్శి రామచంద్రం, కోశాధికారి అరుణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు గుండె పరీక్షలు చేయించుకోవాలి


పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జీడిమెట్ల: పోలీసులు తప్పనిసరిగా గుండె పరీక్షలు చేయించుకోవాలని బాలానగర్ డీసీపీ టి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రి వైద్యులు పోలీసు సిబ్బందికి ఈసీజీ, టూడీకే పరీక్షలు నిర్వహించారు. ఎల్లప్పుడు డ్యూటీలో ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులు ఆరోగ్యంగా ఉండాలని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆస్పత్రి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. వైద్య శిబిరంలో బాలానగర్ ఏసీపీ గంగారాం, ఏడు పోలీస్‌స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలిసిన డబ్బాలు.. జరిగిన గొడవలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వెలిసిన డబ్బాల విషయం ఆందోళనకు దారి తీసింది. తహసీల్దార్ కార్యాలయం ముందు కొంతమంది జిరాక్స్, టీకొట్టు, ఇతర షాపుల నిమిత్తం రాత్రికి రాత్రికి డబ్బాలు వేసుకున్నారు. మంగళవారం ఉదయం ఈ స్థలం నాదంటే నాదని కొంతమంది వాదించుకున్నారు. ఇంతలో మరో ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చి స్థానికంగా మమ్మల్ని కాదని వేరే వాళ్లు ఎలా డబ్బాలు ఏర్పాటు చేస్తారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. దీంతో గొడవ పెద్దది అవ్వడంతో జగద్గిరిగుట్ట పోలీసులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.